ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

శనివారం 5 జూలై 2025

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన న్యాయవాదులు

వేములవాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ లక్ష్మణ్‌లను వేములవాడ న్యాయవాదుల సంఘం సభ్యులు కలిశారు. ప్రత్యేక అదనపు కోర్టు, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేయాలని, కోనరావుపేట మండలాన్ని వేములవాడ కోర్టులో కలపాలని కోరారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. రాజరాజేశ్వర స్వామి ప్రసాదాన్ని అందజేసి, శేషవస్త్రంతో సత్కరించారు. బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ కమిటీ అథారిటీ కార్యదర్శి నాగలక్ష్మిలను కలిశారు. వేములవాడ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గుండ రవి, ప్రధానకార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, సభ్యులు నాగుల సంపత్ కుమార్, పంపరి శంకరయ్య, బొజ్జ మహేందర్, గుజ్జే మనోహర్, కనికరపు శ్రీనివాస్, గుడిపల్లి మహేశ్, కనపర్తి రాజశేఖర్, కోల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్మాల గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

గంభీరావుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నర్మాల సాంఘీక సంక్షేమ గురుకుల ఆశ్రమ పాఠశాల జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయలను డీఈవో పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా చూడాలని డీఈవో సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎంఈవో గంగరాం తదితరులు ఉన్నారు.

ఉపాధి వేటలో..



- ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వలస కూలీలు
- ఖరీఫ్ నాట్లతో చేతినిండా పనులు
- కూలీల కొరతతో అడ్వాన్సులు..
- జిల్లాలో 2.43 లక్షలు ఎకరాల్లో ఖరీఫ్ సాగు

వరినాట్లు వేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర కూలీలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఉపాధివేటలో వందల కిలో మీటర్లు దాటుకుంటూ వివిధ రాష్ట్రాల నుంచి కూలీలు వ్యవసాయ పనుల కోసం రాజన్న సిరిసిల్ల జిల్లాకు వలస వస్తున్నారు. వర్షాలు ఆలస్యమైనా వ్యవసాయ బావులు, బోరు బావుల్లో నీళ్ల ఉన్నచోట నాట్లు మొదలయ్యాయి. నాలుగు రోజులగా వర్షాలు పడుతుండటంతో నాట్లు పెరిగి వలస కూలీలకు చేతినిండా పనులు ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాకు ప్రతిఏటా వరినాట్లు, పత్తిలో కలుపు తీయడం వంటి పనులకు ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ రాష్ట్రాల నుంచి దాదాపుగా వెయ్యి మంది వరకు కూలీలు వలస వచ్చారు. జిల్లాలో 2.43 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. ఇందులో ప్రధానంగా వరి సాగు 1.84 లక్షల ఎకరాలు, పత్తి 49760 ఎకరాలు వేసుకుంటున్నారు. ఇందులో వరి నాట్లు జిల్లాలో ఇప్పటికీ మొదలు కాలేదు. పత్తి విత్తనాలు 30 వేల ఎకరాల్లో వెసుకున్నారు. జిల్లాలో వరి సాగు పెరిగినా కూలీల కొరతను రైతులు ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో ఆరు రాష్ట్రాల నుంచి జిల్లాకు వ్యవసాయ పనుల కోసం రావడంతో రైతులకు సాగు ఇబ్బందులు తొలగిపోతున్నాయి. గడిచిన సీజన్‌లలో కూడా వలస కూలీలతోనే సాగు చేసుకున్న రైతులు ప్రస్తుత ఖరీఫ్‌లో కూడా వలస కూలీలతోనే పనులు చేయించుకుంటున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా రెండు పంటల్లోనూ రైతులకు పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలే ఆధారంగా మారుతున్నారు.

● పెరిగిన డిమాండ్..

గత మూడు సంవత్సరాలుగా ఖరీఫ్, యాసంగి సీజన్ల సమయంలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధిని వెతుక్కుంటూ వరినాట్లకు కూలీలు వలస వస్తున్నారు. జిల్లాలోని గంభీరావు పేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, ఇల్లంతకుంట, బోయినపల్లి, వేములవాడ ప్రాంతాల్లో వలస కూలీలు వరినాట్లు వేస్తున్నారు. ఇక్కడి మధ్యవర్తుల ద్వారా కొందరు ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చారు. ఇతరరాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలకు ఎకరానికి రూ4వేల..

మిగతా 8లో

భూగర్భ జలాలను పెంచేలా పనులు చేపట్టాలి



పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో శేషాద్రి

ఎల్లారెడ్డిపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి) : గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంచేలా పనులను చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం, రాచర్లతిమ్మాపూర్ గ్రామాల్లో వాటర్ షెడ్డు పథకంలో చేపట్టిన ఊటకుంట, చెక్ డ్యాం పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. విడి రాళ్ల కట్ట నిర్మాణం, రాళ్ల కట్టలు, గేబియాన్ నిర్మాణం, చెక్ డ్యాంల నిర్మాణాలకు అనువైన స్థలాలను గుర్తించాలని అన్నారు. పలు నిర్మాణాల వల్ల నేల కోతకు గురవకుండా ఉండడంతో పాటు భూసారాన్ని పెంచేందుకు దోహదపడుతాయని అన్నారు. భూగర్భ జలాలు పెరగడం వల్ల అటవీ విస్తీర్ణం, వ్యవసాయ దిగుబడులు అధికంగా వచ్చే అవకాశాలుంటాయని అన్నారు. పనుల్లో జాప్యం చేస్తే చర్యలు తప్పవని డీఆర్డీవో శేషాద్రి హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో రాజు, వాటర్ షెడ్డు పథకం ప్రాజెక్ట్ అధికారి శ్రీహరి, ఈజీఎస్ ఏపీవో కొమురయ్య, ప్రత్యేక అధికారులు కృష్ణహరి, భాస్కర్‌రెడ్డి, ఏఈ అర్షద్‌పాషా, పంచాయతీ కార్యదర్శులు దేవరాజు, సంపత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



జన జాతీయ గౌరవ్ వర్ష్ వేడుకల్లో పాల్గొన్న అధికారులు

రుద్రంగి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రభుత్వం ద్వారా అందే సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజనాబివృద్ధి అధికారి సంగీత అన్నారు. పీఎం జన జాతీయ గౌరవ్ వర్ష వేడుకల్లో భాగంగా దెగవాత్ తండాలో గ్రామంతోపాటు మండలంలోని గైదిగుట్ట, అడ్డబోరు, వీరునితండా గిరిజనులకు ధర్తి అబా జన్ భగీధరీ అభియాన్ అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి భారతి, ఎంపీడీవో నటరాజ్, తహసీల్దార్ పుష్పలత, ఎంపీవో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల సేవలు చిరస్మరణీయం : కలెక్టర్



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంతి రోశయ్య జయంతి వేడుకలతో పాటు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ, జిల్లా యువజన క్రీడాల శాఖ, జిల్లా బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో పాటు జిల్లా అధికారులు పాల్గొని మాజీ సీఎం రోశయ్య, దొడ్డి కొమురయ్యల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి రాందాస్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజమనోహర్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

17వ పోలీస్ బెటాలియన్‌లో..

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో శుక్రవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి బెటాలియన్ కమాండెంట్ ఎంఐ సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ జగదీశ్వర్‌రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాల విధానాలతో బీడీ కార్మికులకు ఉపాధి కరువు

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీ రమ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో బీడీ కార్మికులకు సరైన ఉపాధి లేకుండా పోయిందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వి రమ అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శుక్రవారం సీఐటీయూ బీడి సిగార్ వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈనెల 27, 28 వతేదీలలో జరిగే జిల్లా స్థాయి 3వ మహాసభకు సంబంధించిన కరపత్రాలను నాయకులతో కలిసి ఎస్‌వి రమ అవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రమ మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్ష మంది కార్మికులు బీడీ పరిశ్రమపై ఆధారపడి ఉన్నారన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన బీడీ కార్మికులకు సరైన ఉపాధి దొరకడం లేదన్నారు. ఈనెల 27, 28వ తేదీలల్లో జిల్లా కేంద్రంలో రెండురోజుల పాటు బీడీ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, నూరం పద్మ, గుర్రం అశోక్, అన్నల్‌దాస్ గణేష్, శ్రీరాముల రమేష్‌చంద్ర, దాసరి రూప, గోవిందు లక్ష్మణ్, జిందం కమలాకర్, బెజుగం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతపై అవగాహన కలిగి ఉండాలి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ - మరిమడ్లలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులకు భూమిపూజ



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న బండి సంజయ్



విద్యార్థులు తయారుచేసిన సైన్స్ పరికరాలను పరిశీలిస్తున్న బండి సంజయ్

కోనరావుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నూతన టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలని,లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా ప్రయాణించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఐదు కోట్లతో అభివృద్ధి పనులకు శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి మంత్రి బండి సంజయ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్‌కి మార్చి ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థిని విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞా విజ్ఞాన పరికరాల ద్వారా ఏర్పాటు చేసిన పరికరాలను తిలకించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఐ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించి తరగతిలో విద్యార్థులతో విద్యాభ్యాసన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా ప్రయాణించాలని సూచించారు. ప్రభుత్వం ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆధునిక సాంకేతికత ద్వారా క్లిష్టమైన సమస్యల పరిష్కారం లభిస్తుందని, నూతన టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎంపీ నిధులతో సోలార్ ప్లాంట్ డిజిటల్ బోర్డులను కూడా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా 20వేలకు పైగా గిరిజన జనాభా ఉన్న మండలాల్లో ఏకలవ్య మోడల్ స్కూల్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 728 పాఠశాలలు లక్ష్యం కాగా, సుమారు 500 పాఠశాలలను ప్రారంభించగా 1.5లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఏకలవ్య పాఠశాలల వ్యవస్థ ప్రధాన లక్ష్యం చదువే కాకుండా క్రీడా, కళ, సాంస్కృతిక రంగాల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులను ఈ పాఠశాలల ద్వారా సిద్ధం చేస్తున్నారని అన్నారు. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సీబీఎస్ఈ విధానంతో అత్యున్నతమైన, నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. ఏకలవ్య పాఠశాలల పథకాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం సుమారు 25 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందన్నారు. ఈ పాఠశాలల్లో 1,40,000మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 23పాఠశాలల్లో సుమారు పదివేల మంది విద్యార్థులు ఉన్నారని మొత్తం మూడు లక్షల 80 వేల మంది గిరిజన ఆదివాసి విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ఆ దిశగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఏకలవ్య రెసిడెన్షియల్ మోడల్ స్కూల్లో ఐఐటి, జేఈఈ, నీట్, ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తున్నారన్నారు. గిరిజన బిడ్డలకు అర్థం కావడం కోసం ప్రాంతీయ భాషలను నేర్పేందుకు సంబంధిత భాష బోధకులను నియమిస్తున్నామన్నారు. విదేశాల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ విజయలక్ష్మీ, ఎంపీడీవో శంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆర్ఎస్ యాదవ్, బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, అల్లాడి రమేష్, రేగుల మల్లికార్జున్, ఎర్రం మహేష్, సురేందర్ రావు, మండల నాయకులు మిర్యాల్‌కార్ బాలాజీ, తిరుపతి గౌడ్, తిరుపతి, వెలిశాల రవి, మోత్కు మోహన్, జింక వెంకటి, జలందర్, సాయి గౌడ్, రవీందర్ గౌడ్, పల్లం అన్నపూర్ణ, అంబోజ లక్ష్మీనారాయణ, అవురం తిరుపతి, ముష్ఠం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ' మహిళలకు కలెక్టర్ అభినందనలు..

- సమాఖ్యకు నిరంతరం ఆదాయం చేకూరేందుకు గ్యాస్ ఏజెన్సీ మంజూరు



ఆదర్శ మహిళా సమాఖ్య సభ్యులను అభినందిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట ఆదర్శ మండల సమాఖ్యకు నిరంతరం ఆదాయం చేకూరేందుకు గ్యాస్ ఏజెన్సీని మంజూరు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రిని కలెక్టర్ సందీప్‌కుమార్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ చేపట్టిన ఆత్మ నిర్భర్ సంఘటన్ అవార్డుకు ఇల్లంతకుంట అదర్శ మండల సమాఖ్య ఎంపిక కావడంతో శుక్రవారం అదర్శ సమాఖ్య సభ్యులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కలువగా వారిని ప్రతేక్యంగా అభినందించారు. వారితో సమావేశాన్ని ఏర్పాటుచేసి సమాఖ్య చేపట్టిన కార్యక్రమాలను అడిగి తెలుసు కున్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో బ్యాంకురుణాల అందజేత, రికవరీ, క్రమం తప్పకుండా సమావేశాల నిర్వహణ, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నటు తెలుపడంతో వారిని కలెక్టర్ అభినందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదర్శ మండల సమాఖ్యకు నిరంతరం ఆదాయం వచ్చేలా గ్యాస్ ఏజెన్సీ మంజూరు చేస్తామన్నారు. సమాఖ్య బాధ్యులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా తీర్చిదిద్దేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, డీపీఎం వంగ రవీందర్, ఏపీఎం వాణి, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- బీఆర్ఎస్ శ్రేణుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

తంగళ్లపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి విద్యార్థుల సమస్యలపై ఆరా తీయడానికి వెళ్లగా సిబ్బంది అనుమతించలేదు. ప్రధాన గేట్‌కు తాళం వేశారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు గంట పాటు గేట్ ముందు వేచి చూసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ రెండు రోజులుగా గిరిజన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆందోళన చేస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేయడానికి వస్తే కళాశాలలోకి అనుమతివ్వకుండా గేట్‌కు తాళలు వేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని విమర్శించారు. విద్యాశాఖకు మంత్రి లేరని ముఖ్యమంత్రి వద్దనే ఉన్న శాఖకు న్యాయం జరగడం లేదన్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థుల సమస్యలపై 24 గంటల్లోపు పరిష్కరించకుంటే బీఆర్ఎస్ పక్షాన విరాళలు సేకరించి కేటీఆర్ ద్వారా అందిస్తామని అన్నారు. తక్షణమే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పడిగెల మానస, ప్యాక్స్ చైర్మన్‌లు బండి దేవదాస్, కొడూరి భాస్కర్‌గౌడ్‌లు, వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, నాయకులు కోడి అంతయ్య, అంకారపు రవీందర్, పునపెల్లి సరస్వతి, అంకారపు అనిత, కొడం సంధ్యరాణి, మాట్ల మధు, పడిగెల రాజు, బండి జగన్, క్యారం జగత్, బాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు

- తాను చదివిన పాఠశాలలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ

ఎల్లారెడ్డిపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తాను చిన్నతనంలో చదువుకున్న బడిలో నెలకొన్న సమస్యలను తీర్చేందుకు ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామానికి చెందిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ చూపారు. ప్రాథమిక ఉన్నత విద్యను మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లో ఆయన కొనసాగించారు. పాఠశాలలో తరగతి గదులు సరిపడక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ ఇటీవల బడి సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యే సత్యం దృష్టికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీసుకెళ్లారు. దాంతో స్పందించిన ఆయన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వివరించారు. పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తూ శుక్రవారం కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



గుండారంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

8

పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి

- నివాళులర్పించిన అధికారులు, నాయకులు



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

8

స్కూల్ బస్సు, ఆటో ఢీ

ముత్తారం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌బస్సు, ఆటోను ఢీకొన్న సంఘటన మండలంలోని మైదంబండ గ్రామశివారులో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని ఓప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు ఆటోనుఢీకొన్న సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 9మందికి తీవ్రగాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నట్లు సమాచారం. సంఘటనపై ఎస్సై నరేష్‌ను వివరణ కోరగా ఇంకా ఎటువంటి సమాచారం అందలేదని తెలిపారు.

కార్మికుడికి గాయాలు

గోదావరిఖని, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే 11ఇంక్లైన్‌లో శుక్రవారం ఉదయం 9గంటలషిఫ్టులో ప్రమాదం జరిగింది. బదిలీవర్కర్ జీ శ్రీకాంత్ మెడపై బొగ్గు కూలింది. దీంతోశ్రీకాంత్‌కు బలమైన గాయాలయ్యాయి. తోటికార్మికులు శ్రీకాంత్‌ను సింగరేణి ఏరియాఆసుపత్రికి తరలించారు. శ్రీకాంత్ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. సింగరేణి అధికారుల రక్షణ చర్యల నిర్లక్ష్యమే కారణమని గుర్తింపుకార్మిక సంఘం ఎల్లాగౌడ్, బ్రాంచ్‌కార్యదర్శి ఆరెల్లి పోషం ఆరోపించారు. కార్మికసంఘాల నేతలు ఆసుపత్రికి వెళ్లి గాయపడినకార్మికుడిని పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మంథనిరూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిసోమన్‌పల్లి గ్రామ శివారులో శుక్రవారం ఇసుకలారీ ఢీకొన్న ప్రమాదంలో పాగేశ్రీనివాస్ అనేవ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ మంథని నుంచి గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా గ్రామశివారులోని కల్వర్టు వద్ద ఇసుకలారీ ఢీకొనడంతో శ్రీనివాస్ ఎడమ కాలు నుజ్జునుజ్జుకావడంతోపాటు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్సకోసం కరీంనగర్‌కుతరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా నగునూర్ శివారులోని వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. నగునూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్, యజమాని ఒర్సు నర్సయ్యపై కేసు నమోదు చేసినట్లు, కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

చౌకధరల దుకాణం సీజ్

ఇల్లంతకుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమారంపేటలోని చౌకధరల దుకాణాన్ని రెవెన్యూ అధికారులు శుక్రవారం సీజ్‌చేశారు. 4క్వింటాళ్ల సన్నబియ్యం రికార్డుల కంటే తక్కువగా ఉండటంతో సీజ్‌చేశారు. తనిఖీల్లో సివిల్‌సప్లై డీటీ బొబ్బిలి సత్యనారాయణ, ఇల్లంతకుంట డీటీసురభి సత్యనారాయణ, ఆర్ఐసంతోష్‌కుమార్ ఉన్నారు.

ముక్తిప్రద దినం తొలి ఏకాదశి

సిరిసిల్ల/ కరీంనగర్ కల్చరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ ఏకాదశి తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం జరుపుకోనున్నారు. ఏకాదశికి పండుగలు ఎత్తుకుని, ఉగాదితో ఉడుగుతాయి అనే నానుడి ప్రకారం తొలి ఏకాదశి నుంచే పండుగలు ప్రారంభమవుతాయి. ఏకా



రేపటి నుంచి చాతుర్మాస్య దీక్షలు ప్రారంభం

ఆలయాల్లో పూజలు, గృహాల్లో విందులు

దశి వ్రతంలో ముఖ్యమైంది ఉప వాసం. ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశిగా జరుపుకుంటారు. శయన ఏకాదశిగా పిలిచే ఈ రోజు పాలకడలిలో శ్రీమన్నారాయణుడు శయనించి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు మేలుకొంటాడని శాస్త్రాలు చెబుతున్నాయి. చాతుర్మాస్య దీక్షల్లో భాగంగా గృహస్తులు, స్వామీజీలు, యతీశ్వరులు, పీఠాధిపతులు 4 నెలలకు పైగా దీక్షలో ఉంటారు. ఏడాదిలో వచ్చే 24 ఏకాదశిలలో తొలి ఏకాదశికి విశిష్టత ఉంది. ఈ మాసం, వాతావరణం తొలకరి ప్రారంభంతో వర్షాలు కురిసి పంటలకు అను కూలంగా మారుతాయి. దైవానుగ్రహానికి, పండుగల ప్రారంభానికి కారణమైన ఈ రోజున ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హవనాలు నిర్వహిస్తారు. నదీ స్నానాలు, పుణ్యక్షేత్ర దర్శనాలు, వ్రతాలు, దాన ధర్మాలు ఆచరిస్తారు. ఇళ్లలో పిండి వంటల విందులు, కబుర్లతో కాల క్షేపం చేస్తారు. రైతులు వేడుకగా జరుపుకునే ఈ ఏకాదశినే పూర్వం సంవత్సరారంభంగా పరిగణించేవారు. ప్రకృతి వైపరీత్యాలు రావద్దని, పంటలకు తెగుళ్లు సోకవద్దని రైతులు ప్రార్థిస్తారు.

ఏకాదశి వ్రత మహత్యం

పవిత్ర ఆధ్యాత్మిక ముక్తిప్రద దినం తొలి ఏకాదశి. దీనికే హరి దినమని మరో పేరు ఉంది. ఏకాదశి వ్రతంలో ఉన్న విశిష్టత పద్మపురాణం ద్వారా తెలుస్తుంది. త్రిమూర్తులలో శ్రీహరితో ముడిపడిన ఈ ఏకాదశి మహత్యం గురించి అనేక కథలు కూడా పురాణాల్లో ఉన్నాయి. కష్టాల్లో తలమునకలవుతున్న మానవ జాతిని కాపాడడానికి శ్రీహరి ఈ ఏకాదశిని ఏర్పాటు చేశాడని, వ్రతాన్ని నియమనిష్టలతో ఆచరిస్తే సమస్త వ్యాధుల నుంచి విముక్తి పొందుతారని చెబుతారు.

ముఖ్య రోజులివే

ఈ నెల 6న తొలి ఏకాదశి, 9న గురుమూఢ నివృత్తి, 10న వ్యాస (గురు) పౌర్ణమి, 13న సికింద్రాబాద్ మహంకాళీ జాతర, 16 నుంచి దక్షిణాయనం ప్రారంభం, 20న లాల్‌దర్వాజ బోనాలు, 24న చుక్కల అమావాస్య, 25 నుంచి శ్రావణమాసం ప్రారంభం, సుదర్శన జయంతి, 28న నాగులచవితి, ఆండాళ్ తిరునక్షత్రం, 29న నాగ పంచమి, గరుడ పంచమి, ఆగస్టు 8న వరలక్ష్మీవ్రతం, హయగ్రీవ జయంతి, 9న రాఖీ పౌర్ణమి, 16న స్మార్త కృష్ణాష్టమి, 23న పొలాల అమావాస్య, 27న వినాయకచవితి.

రేపు రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో తొలి ఏకాదశిని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఆలయంలో శ్రీస్వామి వారితో పాటు అనుబంధ పరివార దేవతలకు ఉదయం అభిషేకం, అర్చనలు నిర్వహించనున్నారు. శ్రీ రుక్మిణి విఠలేశ్వర స్వామివారలకు ఉదయం పంచోపనిషత్ ద్వారా అభిషేకం సాయంత్రం 6.30 గంటల నుంచి మహాపూజను ఘణంగా నిర్వహించనున్నారు. తొలి ఏకాదశిని పురష్కరించుకుని ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం సుప్రభాత సేవ వరకు అఖండ భజన, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

గూడ్స్ రైలు బోగీలో మంటలు

ఓదెల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం నిలిచిఉన్న గూడ్స్‌రైలు బోగీలో మంటలు అంటుకున్నాయి. ఉదయం రైల్వే స్టేషన్‌కు బొగ్గు లోడ్‌తో వచ్చిన గూడ్స్‌రైలు సాయంత్రం వరకు రైల్వేస్టేషన్లో ఆగిఉంది. గూడ్స్‌లోని ఒక బోగీలోపొగలు రావడంతో రైల్వేఅధికారులు అగ్నిమాపకసిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వచ్చి మంటలను ఆర్పివేశారు. మంటలు రావడానికి కారణాలు తెలియరాలేదు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోరుట్ల రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగెం గ్రామశివారు వ్యవసాయక్షేత్రంలో పేకాట ఆడుతున్న నలుగురిని సీసీఎస్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నట్లు కోరుట్ల ఎస్ఐ చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారివద్ద నుంచి 7,210 రూపాయలతోపాటు రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురి పట్టివేత

వీణవంక, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లిగ్రామంలో పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ముగ్గురు డ్రైవర్లు మద్యం సేవించి లారీలు నడుడపుతూ పట్టుబడ్డారని ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

భూములు లాక్కుంటే ఆత్మహత్యలే శరణ్యం

● అటవీశాఖ అధికారులను అడ్డుకున్న రైతులు

ఇల్లంతకుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు తమ భూములని పేర్కొంటున్నారని, భూములు పోతే ఆత్మహత్యలే శరణ్యం అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అనంతారం గ్రామంలోని భూముల విషయంలో కొద్దినెలలుగా వివాదం నెలకొంది. అటవీశాఖ అధికారులు శుక్రవారం గ్రామంలోని భూములను చదును చేసి మొక్కలు నాటడానికి వచ్చారు. విషయం తెలుసుకున్న రైతులు భూముల వద్దకు పోయి తమ ఆవేదన తెలియజేశారు. చదును చేస్తున్న ట్రాక్టర్‌కు అడ్డంగా పడుకొని నిరసన వ్యక్తం చేశారు. కొంతసేపు అధికారులతో వాగ్వివాదానికిదిగారు. అనంతరం రైతులు ఇళ్ళకు వెళ్ళిపోవడంతో అటవీశాఖ అధికారులు కొంతమేర భూమిని చదునుచేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతు తాతముత్తాతల నుంచి సాగుచేసుకొని జీవిస్తున్నామని, తమకు పట్టాదార్ పాసుపుస్తకాలు సైతం ఉన్నాయన్నారు. సమస్యను ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకవెళ్ళామని, ఇల్లంతకుంట తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా చేపట్టామన్నారు. కలెక్టర్ వద్దకు వెళ్ళి సమస్యను వివరించామన్నారు. ప్రభుత్వం భూములను కొలిపించాలని విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయం చేసుకొని జీవించే తమను రోడ్డుమీద వేయాలని అటవీశాఖ అధికారులు చూస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో రైతులు రాజు, అక్కెం ఎల్లయ్య, కొమురయ్య, మల్లేశం, రాము, స్వామి, నరేందర్ పాల్గొన్నారు.



చేనులో రైతులు, అటవీ అధికారులు

మాయమాటలతో బంగారం కాజేసిన యాచకుడు

వీర్నపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో మహిళవద్ద నుంచి బంగారాన్ని కాజేసిన ఘటన వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. అడవిపదిరకు చెందిన చింతల్ ఠానం లక్ష్మి-శంకరయ్య దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ కూతురు నీలవ్వతో నివసిస్తున్నారు. కుమారుడు పూర్ణచందర్ వేములవాడలో నివాసముంటున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై యాచకుడిగా వచ్చి మానసిక అనారోగ్యంతో ఉన్న కూతురు నీలవ్వ నుంచి మాయమాటలతో కుటుంబ వివరాలను సేకరించాడు. అక్కడికివచ్చిన తల్లి లక్ష్మిని నీ కుమారుడికి ప్రాణగండం ఉందని అది తప్పాలంటే తాను చెప్పినట్లు చేయాలని సూచించాడు. తర్వాత పూజలు చేసినట్లు నటించి బంగారుకమ్మలతో అక్కడినుంచి ఉడాయించాడు. దీంతో లక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

బంగారు నగలు చోరీ

ఎలిగేడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ గ్రామంలో గురువారం సాయంత్రం వృద్ధురాలు కేశెట్టి ముత్తమ్మ మెడలోని బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ తనుగుల సత్యనారాయణ తెలిపారు. ఇంట్లో ఉన్న ముత్తమ్మ వద్దకు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి చంపుతామని బెదిరించి మెడలో ఉన్న బంగారు గొలుసు, చెవి కమ్మలు, వెండి కడియాలు, రూ.10వేల నగదును దోచుకెళ్లినట్లు వివరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామన్నారు. సుల్తానాబాద్‌సీఐ సుబ్బారెడ్డి చోరీ విషయం తెలుసుకుని విచారించారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

ఓదెల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం సమీపంలో శుక్రవారం రూపు నారాయణపేటకు చెందిన రాపర్తి రాజు(35) అనే యువకుడు లారీ ఢీకొని మృతిచెందాడు. ప్రయివేటు వరి సీడ్స్ కంపెనీలో సేల్స్ మెన్‌గా ఉద్యోగం చేస్తున్న రాజు రోజు మాదిరిగానే సీడ్స్ కంపెనీ పనిపై ద్విచక్ర వాహనం ద్వారా ఓదెల నుంచి పెగడపల్లి వైపు వెళుతున్నాడు. ఓదెలలో సిమెంట్ బస్తాలను దించివేసి బసంత్‌నగర్ వైపు వేగంగా వెళుతున్న లారీ ఆలయం సమీపంలో వెనుకవైపు నుంచి ఢీకొనడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శిరీష చిన్నారులైన ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు.

కాగా హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాపాయం తప్పేదని పలువురు పేర్కొంటున్నారు. రోజు హెల్మెట్ లేనిదే వెళ్లేవాడుకాదని, అతని కుటుంబ సభ్యులు మిత్రులు తెలిపారు. రాజు తలపై నుంచి లారీ టైర్ వెళ్లడంతో తల చిట్లీపోయి మృతిచెందడం హెల్మెట్ ప్రాధాన్యతను గుర్తు చేస్తుంది.



రాపర్తి రాజు(ఫైల్)

కత్తిపోటుకు గురైన వ్యక్తి మృతి

కోరుట్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణం రవీంద్ర రోడ్డుకు చెందిన ఇట్యాల సత్యనారాయణ(49) అనేవ్యక్తి కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. గత ఆదివారం రోజు సత్యనారాయణపై అదే కాలనీకి చెందిన ఇల్లుటపు గంగనర్సయ్య అలియాస్ బ్యాండ్ అను వ్యక్తి కత్తితో దాడి చేయగా తీవ్రగాయాలపాలు అయ్యాడు. బంధువులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండంగా శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. సత్యనారాయణ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



సత్యనారాయణ(ఫైల్)

భవనంపై నుంచి పడి వృద్ధురాలి మృతి

కోల్‌సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని లక్ష్మీనగర్‌లో శుక్రవారం భవనంపైనుంచి పడి తాటికొండ కనకమ్మ(106) అనే వృద్ధురాలు మృతి చెందింది. లక్ష్మీనగర్‌లో రోడ్లవిస్తరణలో రాజేష్ టెక్స్‌టైల్స్ భవనంలో కొంతభాగాన్ని యజమానులు తొలగించి మరమ్మతులు చేస్తున్నారు. కనకమ్మ వృద్ధాప్యంతో మానసికస్థితి సరిగా లేకపోవడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో బయటకు వచ్చి భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడింది. ఆమెను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు మేకలు మృతి

చందుర్తి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ పల్లిలో శుక్రవారం విద్యుదాఘాతంతో రెండు మేకలు మృతిచెందాయి. మ్యాకల కొమురయ్య గ్రామ సమీపంలో పోచమ్మఆలయం వద్ద తన మేకల మందను కాస్తుండగా విద్యుత్‌వైర్లు తెగిపడ్డాయి. దీంతో అక్కడ గడ్డిమేస్తున్న రెండు మేకలు విద్యుదాఘాతంతో మృతిచెందాయి. మేకల విలువ 20వేలు ఉంటుందని, సెస్ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కొమరయ్య కోరారు.



కన్నాపూర్ నుంచి తరలిస్తున్న మట్టి

అక్రమంగా మట్టి తరలింపు

శంకరపట్నం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాపూర్ గ్రామశివారులో కొందరు అక్రమంగా పెద్దగుట్ట మట్టిని తరలిస్తున్నారు. శంకరపట్నం మండలంలోని వివిధగ్రామాలతోపాటు వీణవంక మండలంలోని కాచాపూర్ శివారులోని పెద్దగుట్ట వద్ద అనుమతులు లేకుండా ఎక్స్‌కావేటర్‌తో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తున్నారు. అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న సదరు వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

ఎల్లారెడ్డిపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఎనగందుల మల్లవ్వ(105) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందింది. మల్లవ్వ భర్త రామయ్య 30 ఏళ్లక్రితం మృతిచెందాడు. మల్లవ్వకు ముగ్గురు కొడుకులు, ఏడుగురు కూతుళ్లతోపాటు మొత్తం 45మంది మనుమలు, మనుమరాళ్లు, మునిమనుమలు, మునిమనుమరాళ్లు ఉన్నారు.



మల్లవ్వ(ఫైల్)

హత్యాయత్నం కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులకు ఐదేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి 1,500 రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పెగడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన తోట మహేందర్ అనేవ్యక్తి 2019ఆగస్టు 16న తనతల్లి, సోదరుడు, మేనల్లుడితో కలిసి నూతనంగా నిర్మిస్తున్న ఇంటి పనికి హాజరయ్యారు. ఈ సమయంలో తోట అనీల్ నారాయణ, తోట మారుతి నారాయణ, తోట జ్యోతి అనే ముగ్గురు కలిసి పాతపగలను మనసులో పెట్టుకుని మహేందర్ కుటుంబంపై మారుణాయుధాలతో హత్యాయత్నానికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై జీవన్ కేసునమోదు చేసి నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు కేవీ సాగర్, త్రివేణి, కిరణ్‌కుమార్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మల్లికార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముగ్గురు ముద్దాయిలకు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయిలకి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష

మంథని, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిట్టుపల్లి గ్రామ శివారులో లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్ పడాల శ్రీధర్‌కు రెండేళ్ల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రావు శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు సీఐ రాజు తెలిపారు. 2021 నవంబర్14న బిట్టుపల్లి గ్రామశివారులోని పొలంవద్ద రోడ్డుపక్కన హార్వేస్టర్‌తో పొలం కోయించడానికి నిలబడి ఉన్న బిట్టుపల్లి గ్రామానికి చెందిన చిలువేరి గట్టయ్య, ధర్మల్ల రాయమల్లును ఖమ్మంపల్లి ఇసుక క్వారీకి వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. ఈమేరకు నమోదైన కేసులో విచారణ అనంతరం లారీ అజాగ్రత్తగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన లారీడ్రైవర్ శ్రీధర్‌కు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రోడ్డుపైనే ఇసుక అన్‌లోడ్ చేసిన ట్రాక్టర్ డ్రైవర్

శంకరపట్నం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ రోడ్డుపైనే ఇసుకను అన్‌లోడ్ చేసి వెళ్లాడు. వివరాల్లోకి వెళితే.. వీణవంక మండలం మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో కరీంనగర్-వరంగల్ రహదారిపై మాటు వేశారు. ఈక్రమంలో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోగా మరో ట్రాక్టర్ ముత్తారం గ్రామం రాగానే గమనించిన డ్రైవర్ కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో కమాన్‌ముందే ఇసుకను అన్‌లోడ్ చేసి వెళ్లిపోయాడు.



రోడ్డుపైన అన్‌లోడ్ చేసిన ఇసుక

మానేరు వాగులో 33 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

● అధికారుల కళ్లుగప్పి 19 ట్రాక్టర్ల పరారీ ● 14 ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామశివారులోని శుక్రవారం మానేరు వాగు సమీపంలో తహసీల్దార్ సుజాత ఆధ్వర్యంలోని అధికారులు మాటువేసి 33ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాహనాలను తహసీల్ కార్యాలయానికి తరలించే క్రమంలో 19ట్రాక్టర్ల డ్రైవర్లు అధికారులకళ్లుగప్పి తప్పించుకుపారిపోయారు. తహసీల్దార్ సుజాత తెలిపినవివరాల మేరకు.. మండలంలోని పలుగ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మఇళ్ల నిర్మాణాల కోసం మండలంలోని వెంకటాపూర్ గ్రామ శివారులోని మానేరువాగు నుంచి ఇసుకకు అనుమతులను జారీచేశారు. ఉదయం 10గంటల నుంచి ఇసుకను రవాణా చేయాల్సి ఉండగా ఉదయం 6గంటలకే రవాణాదారులు తమ ట్రాక్టర్లను వాగులోకి దింపారు. ఇసుకను సిరిసిల్ల మున్సిపల్‌పరిధిలోని సర్దాపూర్, ఇతరగ్రామాలకు గుట్టుగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వాగు వద్దకు చేరుకున్నారు. ఇసుక లోడుతో ఉన్న 33 ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. అనుమతులు ఒక చోటకు తీసుకుని మరోచోటకు రవాణా చేస్తున్నారని గుర్తించి వాహనాలను సిబ్బంది సహాయంతో తహసీల్ కార్యాలయానికి తరలించేందుకు సిద్ధమయ్యారు. మానేరు వాగు నుంచి కార్యాలయానికి వస్తున్న ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు అధికారుల కళ్లు గప్పి 19 వాహనాలు దారి మళ్లించి పారిపోయాయి. 14 ట్రాక్టర్లను తహసీల్ కార్యాలయానికి తరలించామని సుజాత పేర్కొన్నారు. తప్పించుకుపోయిన 19 ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు నేరుగా వాహనాలను తీసుకురావాలని, లేని పక్షంలో తమ వద్ద వాహనాలకు సంబంధించిన నంబర్లు ఉన్నాయని తెలిపారు. పారిపోయిన వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టుబడిన ఒక్కో వాహనానికి రూ.10వేల చొప్పున జరిమానా విధించామని తహసీల్దార్ సుజాత స్పష్టం చేశారు.



అధికారులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

సమస్యలు పరిష్కరించాలని బీడీ కార్మికుల నిరసన



వెల్లుల్ల ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న బీడీ కార్మికులు

మెట్‌పల్లి రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులు తమ ప్రధాన సమస్యలు పరిష్కారించాలని రోడ్డెక్కారు. శుక్రవారం మండలంలోని వెల్లుల్ల గ్రామశివారులోని సాంబాజీ బీడీకంపెనీ ప్రధాన కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాసిరకం తునికాకు, తంబాకు ఇవ్వడం వల్ల చాటింగ్ పేరుతో తీవ్రంగా నష్టపోతున్నామని, నెలకు కేవలం తొమ్మిది రోజులు మాత్రమే పని కల్పిస్తున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ కార్మికులకు నెలకు రూ. 4వేలు ఫించన్, రాజీనామ చేసిన కార్మికులకు నెలకు రూ. 6వేలు జీతభత్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

● చెడిపోయిన 17కిలోల చికెన్, వెజ్‌వంటకాల గుర్తింపు

కరీంనగర్ క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-మల్కాపూర్ రోడ్ జ్యోతినగర్‌లోని రాజుగారి బిర్యానీ అడ్డ అనే రెస్టారెంట్‌పై కరీంనగర్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అంకిత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఇటీవల అందిన ఫిర్యాదుతో తనిఖీలు చేపట్టినట్లు అంకిత్‌రెడ్డి తెలిపారు. రెస్టారెంట్ కిచెన్, రిఫ్రిజిరేటర్‌లో ముందు రోజు మిగిలిపోయిన బాయిల్డ్ చికెన్, వివిధ రకాల చికెన్ ఐటమ్స్ 17 కిలోల వరకు గుర్తించి పారవేసినట్లు చెప్పారు. చికెన్‌తోపాటు కార్న్, వెజ్ ఐటమ్స్ ఉన్నాయన్నారు. చికెన్ ఐటమ్స్‌లో కృత్రిమ రంగుల వాడకాన్ని గుర్తించామని, నిబంధనలకు విరుద్ధంగా రంగులు వాడినందుకు రెస్టారెంట్ యజమానికి నోటీసు అందజేశామని తెలిపారు. నాన్ వెజ్ ఐటమ్స్‌కి సంబంధించిన ముడి పదార్థాలపై తయారీ తేదీ, గడువు లేబుల్ వేయాలన్నారు.

రోడ్డు పనులను అడ్డుకున్న రైతు

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

శంకరపట్నం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన సిద్ధురూ రాజేశ్వర్‌రావు అనేరైతు తనకు పూర్తి స్థాయిలో పరిహారం అందలేదని శుక్రవారం కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి నిర్మాణపనులను అడ్డుకున్నాడు. సదరు రైతు పొలంలో వరినాటువేశాడు. అయితే అధికారులు టిప్పర్లతో పొలంలో మట్టి పోస్తుండగా రైతు అడ్డుకున్నాడు. దీంతో తహసీల్దార్ సురేఖ, ఎస్ఐశేఖర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని రైతుతో మాట్లాడారు. కాగా రోడ్డుపనులను అడ్డుకున్న రాజేశ్వర్ రావును అదుపులోకి తీసుకున్న పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేఖ, పోలీసులు, పక్కన చేతిలో కాగితాలతో రైతు

అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు: తహసీల్దార్ శ్రీనివాస్

మెట్‌పల్లి రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మెట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం ఉదయం ఆత్మకూర్, రామలచ్చక్కపేట గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నరనే సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేపట్టామన్నారు. గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ, ట్రాక్టర్‌ను ఆర్ఐ ఉమేష్ పట్టుకున్నారని తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఆర్ఐ ఉమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఖర్గే, చిత్రంలో సీఎం రేవంత్ రెడ్డి

క్రమశిక్షణకు మారు పేరు రోశయ్య

- యువనేతలకు ఆదర్శం ఆయన జీవితం
- మాజీ సీఎం రోశయ్య 92వ జయంతి సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి, పొన్నం
- చాగంటికి సత్కారంతో పాటు ప్రశంసా పత్రం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్/రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు.. అజాత శత్రువుగా తెలుగు ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న నేత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య అని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు కొనియాడారు. నేటి యువతరం రోశయ్య రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రోశయ్య 92వ జయంతి సభను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి మంత్రులు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ప్రవచన కర్త, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చాగంటి మాట్లాడుతూ.. రోశయ్య గవర్నర్‌గా ఉన్న సమయంలో చెన్నైలో ప్రవచనాలు చెప్పేందుకు వెళ్లినప్పుడు రాజ్‌భవన్ నుంచి బయటొకొచ్చి మరీ ఆయన స్వాగతం పలికారని గుర్తు చేసుకున్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి మాట్లాడుతూ.. రోశయ్య ఎప్పుడూ అందరికీ ఆదర్శ నాయకత్వాన్ని అందించే లక్ష్యంతో పనిచేశారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఆదర్శ రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. 16 ఏళ్ల అప్పులు చేయకుండా ఉన్న దాంట్లో నిధులు సర్దుబాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన గొప్ప నేత రోశయ్య అని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి నిర్వహించడం అభినందనీయమని.. ఆయన వాగ్ధాటి, ఛలోక్తులను ఎవరూ మర్చిపోరని చెప్పారు. రోశయ్య ఆలోచనలు, ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలను పార్టీలకతీతంగా ఇప్పుడు అనుసరించాల్సిన అవసరముందని గుత్తా అన్నారు. ఇటు డీజీపీ కార్యాలయంలోనూ రోశయ్య జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి అదనపు డీజీపీ మహేశ్ భగవత్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే

మాజీ సీఎం రోశయ్య కాంస్య విగ్రహం హైదరాబాద్‌లో ఆవిష్కృతమైంది. లక్డీకాపూల్‌లోని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో 450 కిలోల బరువుతో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, దయానంద్, సీనియర్ నేతలు వి.హన్మంతరావు, కేవీపీ రామచంద్రరావు, టీజీ వెంకటేశ్, ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు, మూర్తి పాల్గొన్నారు.

గ్రూపులు కడతామంటే.. భయపడం!

(మొదటిపేజీ తరువాయి)

కమిటీల ఉమ్మడి, విస్తృత కార్యవర్గ సమావేశాల్లో ఖర్గే దిశానిర్దేశం చేశారు. ఇందులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి పాల్గొన్నారు.

తెలంగాణ.. కాంగ్రెస్‌కు మోడల్ స్టేట్!

తెలంగాణను కాంగ్రెస్ మోడల్ స్టేట్‌గా దేశానికి చూపనున్నట్టు ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ సైద్ధాంతాలకు అనుగుణంగానే రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా హామీలను సమర్థంగా అమలు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. నేతలు పార్టీ ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తీరాలన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ సమావేశంలో చెప్పారు. ఇక రేవంత్ మంత్రివర్గంలో పనిచేయాలన్నది తన కోరికని, జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చెప్పారు.

మంత్రులపై సీఎం రేవంత్ అసంతృప్తి!

మంత్రులు, ఆయా జిల్లాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నేతల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నామినేటెడ్ పోస్టులకు ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి పంపాలని మంత్రులు, పీసీసీ చీఫ్‌ను నాలుగు నెలలుగా కోరుతున్నా.. స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రతిపాదనలు పంపితే వెంటనే ఆమోదిస్తానని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడగానే ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి ఉంటే.. నామినేటెడ్ పోస్టుల్లో ఒక టర్మ్ అవకాశాలు పూర్తయ్యేవని వివరించారు.

నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ:ఖర్గే

జూలై నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మంత్రులు, టీపీసీసీ చీఫ్‌కు ఖర్గే స్పష్టం చేశారు. దీన్ని సమన్వయం చేసుకునే బాధ్యత పీసీసీ చీఫ్‌దేనని.. పార్టీ కోసం కష్టపడిన వారికి, సమర్థులకే పదవులు ఇవ్వాలని సూచించారు. 'ప్రభుత్వంపై పార్టీ ఫిర్యాదు చేయడం చూశాం గానీ, పార్టీపై ప్రభుత్వం ఫిర్యాదు చేయడం ఇక్కడే చూస్తున్నా' అని ఖర్గే వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు ఖర్గే సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలమని, కాపాడుకోవాలని చెప్పారు.


గాంధీభవన్ చేరుకున్న కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్

పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దు: సీఎం

నేతలు పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దని సీఎం రేవంత్ సూచించారు. పార్టీ పదవులతో గుర్తింపు, గౌరవం దక్కుతాయని, రాజకీయాల్లో ఎదుగుదలకు దోహదపడతాయని చెప్పారు. భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరుగుతాయని, ఎక్కువ మందికి అవకాశాలు వస్తాయని వివరించారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని కోరారు. అందరూ కష్టపడి పనిచేసి.. కాంగ్రెస్‌ను రెండో సారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లూ కాంగ్రెస్‌దే అధికారమని ధీమావ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూసామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం చేద్దాం?

ఈ నెల 7న క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ

తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ జూలై 7న గాంధీభవన్‌లో భేటీ కానుంది. ఆధారాలు చూపకుండా అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందంటూ టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యే అయినందున.. అనిరుధ్‌రెడ్డికి క్రమశిక్షణా చర్యల కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేస్తుందా లేక చర్యల కోసం ఏఐసీసీ క్రమశిక్షణా కమిటీకి సిఫార్సు చేస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇలా ఉంటే గాంధీభవన్‌లో చైర్మన్ మల్లురవి అధ్యక్షతన క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నేతల వివాదంపై పార్టీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభిప్రాయం సేకరించింది. అనంతరం మీడియాతో నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై కమిటీ పెద్దలు తనతో మాట్లాడారన్నారు. చిన్న చిన్న బేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని, త్వరలో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని చెప్పారు.

డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు చారిత్రాత్మక మైలురాయి

- సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

హైదరాబాద్/సైదాబాద్/యాదగిరిగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నేరాలు పాల్పడి జైలుకు వచ్చిన వారిలో పరివర్తన తీసుకురావడమే లక్ష్యంతో రాష్ట్ర జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. చంచల్‌గూడ జైలులో నివృత్తి డీ అడిక్షన్ సెంటర్‌ను శుక్రవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మత్తుకు బానిసైన ఖైదీలకు వైద్య చికిత్స కౌన్సిలింగ్‌ల ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు అభినందనీయమని చెప్పారు. జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ ఖైదీలు మత్తు వ్యసనాన్ని అధిగమించి వారి జీవితాలను పునర్నించడానికి సహాయపడే వాతావరణం చంచల్‌గూడ జైలులో ఉందని ప్రశంసించారు. కాగా, అంతకు ముందు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని జస్టిస్ సూర్యకాంత్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. గర్భాలయంలో స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్నిన్యాయమూర్తికి అందజేశారు. కాగా, బాలల హక్కుల రక్షణ అంశంపై 'వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్' అనే పేరుతో శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయి స్టేక్ హోల్డర్ల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి, హై కోర్ట్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొననున్నారు.


జస్టిస్ సూర్యకాంత్‌కు నృసింహుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ

34 కోట్ల రన్యారావ్ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నటి రన్యారావ్‌కు చెందిన రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. బెంగళూరు విక్టోరియా లే అవుట్‌లోని ఇల్లు, ఆర్కావతి లే అవుట్‌లో స్థలం, తుమకూరులో పారిశ్రామిక స్థలం, ఆనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమిని అటాచ్ చేశామని ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటించారు. దుబాయ్ నుంచి రూ.12.56 కోట్ల విలువైన బంగారాన్ని తెస్తూ.. ఈఏడాది మార్చి 3న కెంపేగౌడ విమానాశ్రయంలో రన్యారావ్ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో రన్యారావ్, రాజు, సాహిల్‌జైన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురూ పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు.

తెరుచుకున్న తుంగభద్ర గేట్లు!

గద్వాల/దోమలపెంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. కృష్ణా, తుంగభద్ర నదుల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరుగుతోంది. శుక్రవారం కర్ణాటకలోని తుంగభద్ర గేట్లు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు 75,612 క్యూసెక్కుల ప్రవాహాలు చేరగా 58 గేట్లకు గాను 21 గేట్లను ఎత్తి 62,612 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 105.79 టీఎంసీలకు.. ప్రస్తుతం 75.84 టీఎంసీలున్నాయి. దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు 1,09,777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఏపీ, తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం 56,998 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 169.86 టీఎంసీలున్నాయి. తుంగభద్ర గేట్లు తెరవడంతో శ్రీశైలానికి వరద మరింత పెరిగే అవకాశముంది. ఇక ఆల్మట్టికి వరద స్థిరంగా కొనసాగుతోంది. 94,767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. లక్ష క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తుండగా 14గేట్ల ద్వారా 95,566, విద్యుదుత్పత్తి ద్వారా 29,494 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రిడ్జిలు, సొరంగాలున్న హైవేలపై టోల్ చార్జీలు సగానికి తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 4: జాతీయ రహదారులపై సొరంగాలు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు లేదా ఎలివేటెడ్ హైవేలు వంటి నిర్మాణాలున్న భాగాలకు టోల్ రేట్లను కేంద్ర ప్రభుత్వం 50శాతం వరకు తగ్గించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ టోల్ చార్జీలను లెక్కించడానికి కొత్త పద్ధతి/ఫార్ములాను నోటిఫై చేస్తూ ఈ నెల 2న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. జాతీయ రహదారిపై ఉండే ప్రతి కిలోమీటరు వంతెనలు లేదా సొరంగాలకు వాహనదారులు సాధారణ టోల్ కన్నా పది రెట్లు ఎక్కువ చెల్లిస్తున్నారు. దీన్ని సవరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సొరంగాలున్న ప్రాంతాల్లో టోల్ రేటును 50 శాతం వరకు తగ్గించినట్టు ఓ అధికారి పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొనే జిల్లా క్రీడకారుల వివరాలను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్ శుక్రవారం ప్రకటించారు. అకిరానందన్, ఫజియాన్, హర్షిత్, సిద్ధార్థ, నురియాన్, తరీష్, విశ్వక్సేన్, ఆరాధ్య, శ్రీహర్ష, తేజ, సుమంత్, మనోహర్, సాయియువన్, సయ్యద్ అబ్దుల్ రహమతుల్లా, విశేష, వైశాలి, సన్విశ్రీ, ధరణిరెడ్డి, సుకీర్తి ఎంపికైనట్లు తెలిపారు. అండర్-10, 12, 14 వయస్సు విభాగాల్లో కరీంనగర్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆది, సోమవారాల్లో పోటీలు ఉంటాయని, క్రీడకారులు ఆదివాయం ఉదయం 6 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని తెలిపారు.

భీమారంలో..

భీమారం: మండలంలోని గోవిందారం ఉన్నత పాఠశాలకు చెందిన బి అవంతిక, బి అభినయ్ అనే విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. జగిత్యాలలో స్వామి వివేకానంద స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపికైనట్లు అథ్లెటిక్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అష్ఫాక్ హుస్సేన్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. ఎంపికైన విద్యార్థులు జూలై 6న హన్మకొండ జేఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్ తెలిపారు.

15 నుంచి తత్కాల్ టికెట్ బుకింగ్‌కు కొత్త నిబంధనలు

కరీంనగర్ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తత్కాల్ టికెట్ బుకింగ్ కోసం రైల్వేశాఖ తాజా మార్గదర్శకాల ప్రకారం ఈ నెల 15 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయని కరీంనగర్ రైల్వే స్టేషన్ మేనేజర్ ప్రకటనలో తెలిపారు. కొత్త నిబంధనల మేరకు ఆధార్ కార్డు తప్పనిసరి అని, తత్కాల్ టికెట్ బుకింగ్ సమయంలో ప్రయాణికులు ఆధార్ నంబరు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఆధార్ లింక్డ్ మొబైల్‌కు ఓటీపీ వస్తుందని తెలిపారు. బుకింగ్‌దారుల ఆధార్‌కు యాక్టివ్ మొబైల్ నంబరు అనుసంధానమై ఉందని నిర్ధారించుకోవాలని, లేకపోతే టికెట్ బుకింగ్ విజయవంతం కావడంలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

రైతుకు భరోసా.. పీఎం కిసాన్ మాన్‌ధన్



- అవగాహన లేక ముందుకు రాని అన్నదాతలు
- పింఛన్ ప్రయోజనానికి దూరం

కరీంనగర్ రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెడుతున్నాయి. అయితే చాలా పథకాలు వారు వ్యవసాయం చేస్తున్నంత కాలమే అండగా నిలుస్తాయి. వృద్ధాప్యంలోకి వచ్చిన తరువాత చాలా మందికి ఆదాయ మార్గాలు ఉండవు. 60 ఏళ్లు దాటిన, సన్న, చిన్నకారు రైతులకు ప్రయోజనం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజనను ప్రవేశపెట్టింది. వృద్ధులైన రైతులకు ప్రతి నెలా 3వేల చొప్పున జీవిత కాలం పింఛన్ ఇవ్వడమే ఈ పథకం లక్ష్యం. దీనిపై సన్న, చిన్న కారు రైతులకు అవగాహన లేక పోవడంతో ముందుకు రావడం లేదు. ప్రభుత్వాలు కూడా దీనిపై అవగాహన కల్పించకపోవడంతో అన్నదాతలు పింఛన్ ప్రయోజనాన్ని కోల్పోతున్నారు.

అర్హులు ఎవరంటే :

18 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న సన్న చిన్న కారు రైతులు అర్హులు. వారికి ఐదు ఎకరాల లోపు సొంత వ్యవసాయ భూమి, ఆయా ప్రభుత్వాల భూ రికార్డుల్లో పేరు నమోదై ఉండాలి, ఆసక్తి ఉన్న రైతులు వయసు వారీగా నిర్దేశించిన ప్రీమియం డబ్బు చెల్లిస్తూ సీఎం కిసాన్ మాన్‌ధన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్), ఈఎస్ఐ, ఈపీఎఫ్‌వో పరిధిలోని వారు అర్హులు. ప్రభుత్వ ఉద్యోగులు, పన్ను చెల్లింపు దారులు, ఆర్థికంగా బాగున్న, సామాజిక భద్రత పథకాల పరిధిలో ఉన్న వారికి ఈ పథకం వర్తించదు.

ప్రీమియం చెల్లించే విధానం

18 నుంచి 40 ఏళ్ల వయస్సున్న రైతులు ప్రతి నెలా 55 నుంచి 200 రూపాయల వరకు ప్రీమియం చెల్లించాలి. వయస్సును బట్టి ప్రీమియం పెరుగుతూ ఉంటుంది. 18ఏళ్ల వయస్సు ఉన్న రైతులు నెలకు 55 రూపాయలు, 21-24 సంవత్సరాల వయస్సు గల వారు 61 రూపాయలు, 25-29 వయస్సు గల వారు 60 రూపాయలు, 30-34 సంవత్సరాల వారు 106 రూపాయలు, 35 నుంచి 39 వయస్సు గల వారు 150 రూపాయలు, 40 సంవత్సరాల వయసు గల వారు 300 రూపాయల చొప్పున చెల్లిస్తే కేంద్రం తన వాటాగా మరో వంతు బీమా డబ్బులు చెల్లిస్తుంది. రైతులు చెల్లించిన మొత్తానికి సమాన మొత్తాన్ని కేంద్రం చెల్లిస్తుంది. ఇలా 60 ఏళ్ల వరకు ప్రీమియం చెల్లిస్తే తర్వాత నెలకు 3వేల చొప్పున పింఛన్ వస్తుంది. బీమా చెల్లించిన రైతు మరణిస్తే ఆయన భార్యకు ప్రతి నెల 1500 రూపాయలు అందజేస్తుంది.

దరఖాస్తు చేసుకోనే పద్ధతి

పీఎం కిసాన్ మాన్‌ధన్ కింద పింఛను ప్రయోజనం పొందేందుకు ఆసక్తి ఉన్న రైతులు సీఎస్‌సీ కేంద్రానికి వెళ్లి పీఎం కిసాన్ కేఎంఐ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్, నామినీ వివరాలు, రైతుల సంతకంతో అప్‌లోడ్ చేయాలి. అనంతరం పింఛన్ కార్డు వస్తుంది. తర్వాత పీఎం కిసాన్ పథకానికి అనుసంధానమైన బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం నగదు చెల్లించాలి.

అవగాహన కల్పిస్తున్నాం

బి.సత్యం, మండల వ్యవసాయ అధికారి



రైతులకు వృద్ధాప్యంలో పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన ఎంతో ఆసరాగా ఉంటుంది. ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు ప్రచారం నిర్వహిస్తున్నాం. ఇప్పటికే నగునూర్ గ్రామం లో రైతులు ప్రీమియం చెల్లింపునకు దరఖాస్తు చేసుకుంటున్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఈ పథకంపై అవగాహన పెంచి రైతులకు పింఛన్ ప్రయోజనాలపై వివరిస్తాం. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

'అలుబుఖారా'లో పోషకాలెన్నో..!

- తీపి, పులుపు, వగరుల సమ్మేళనం
- వర్షాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలను దూరం..


(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

వర్షాకాలంలో వివిధ రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. వాటిని దూరం చేయడానికి ఎన్నో గుణాలు ఉండే అలుబుఖారా పళ్లు వర్షాకాలం వెంట తెస్తుంది. రెండు నెలలు మాత్రమే ఆపిల్ పండులాగా కనిపించే అలుబుఖారా పళ్లు వానాకాలంలో వచ్చే ఇబ్బందులను తొలగిస్తుంది. తీపి, పులుపు, వగరుల సమ్మేళనమైన అలుబుఖారా మేహశాంతి, పైత్యశాంతి, దాహశాంతిని ఇస్తుంది. మార్కెట్‌లో కిలో రూ.240 ధర పలికే అలుబుఖారా అందరినీ ఆకర్షిస్తోంది. అలుబుఖారాలో పలు రకాల పోషకాలు, పిండిపదార్థాలు, మాంసకృత్తులు అధికంగా లభిస్తాయి. అలుబుఖారాను పడిగడుపున తింటే విరేచనం సాఫీగా జరుగుతుంది. ఆకలి పెరుగుతుంది. జీర్ణక్రియను సరి చేస్తుంది. అలసట, బలహీనత తగ్గిస్తుంది. ముక్కునుండి నీరు కారే ఇబ్బంది ఉంటే ఉపశమనం కలుగుతుంది. నిద్రలేమితనాన్ని పోగొడుతుంది. విటమి న్ ఈ యూవీ కిరణాల వల్ల కలిగే హానిని నిరోధిస్తుంది. బీటా కేరోటీన్, ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ కణాలపై ప్రభావం చూపుతుంది. విటమిన్- కె రక్తాన్ని గడ్డకట్టనివ్వకుండా గుండె పనితీరును మెరుగు పరుస్తుంది. విటమిన్-సి చుండ్రును పోగొట్టి, జుట్టు ఒత్తుగా పెరిగేలాగా చూస్తుంది. మతిమరుపు పోగొట్టి మెదడును ఉత్తేజం కలిగిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరిస్తుంది. పాదాల అడు గున మంట, నొప్పులను కూడా నివారిస్తుంది. ఎండిన పళ్లను ఉపయోగించి చారు చేసి ఇస్తే రోగులకు రుచినిచ్చి ఆకలినిపెంచుతుంది.

విద్యార్థులకు సిలబస్‌గా 'లాంగ్‌మార్చ్' నవల



పెద్దింటి అశోక్ కుమార్, లాంగ్‌మార్చ్ నవల

సిరిసిల్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయ పరిధిలోని కళాశాలల్లో ఎంఏ రెండో సంవత్సరం విద్యార్థులకు పాఠ్యాంశంగా సిరిసిల్లకు చెందిన రచయిత పెద్దింటి అశోక్ కుమార్ రాసిన లాంగ్ మార్చ్ నవల ఎంపికైంది. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో రాసిన ఈ నవలను ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు అధ్య యనం చేయనున్నారు. పెద్దింటి అశోక్ కుమార్ సిరిసిల్లలోని రాజీవ్ నగర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఇప్పటికే లాంగ్‌మార్చ్ నవల ఉస్మానియా యూనివర్సిటీలో సిలబస్‌గా ఉంది. దీనితోపాటు నల్గొండలోని నాగార్జున కళాశాల విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం మానవ సంబంధాలపై పెద్దింటి రాసిన జిగిరి అనే నవల పాఠ్యాంశంగా చేశారు. ఈ నవల 12 భాషల్లోకి అనువాదమై వివిధ కళాశాలల్లో సిలబస్‌గా ఉంది. ఈ రెండు నవలలు త్వరలో సినిమాలుగా కూడా రాబోతున్నాయి.

ప్రైవేటు పాఠశాల బస్సును అడ్డుకున్న గ్రామస్థులు

- బస్సు నుంచి పిల్లలను దింపి ప్రభుత్వ పాఠశాలకు
- తల్లిదండ్రులకు అవగాహన


దుద్దెనపల్లిలో పాఠశాల బస్సును అడ్డుకున్న గ్రామస్థులు

సైదాపూర్, జూలై 4: సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లిలో గ్రామస్థులు శుక్రవారం తమ గ్రామానికి వచ్చిన ప్రైవేటు పాఠశాల బస్సును అడ్డుకొని, అందులో ఉన్న గ్రామ విద్యార్థులను దింపి ప్రభుత్వ పాఠశాలకు పంపించారు. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అవగాహన కల్పించారు. విద్యార్థులు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే స్థితికి వచ్చాయని వాటిని కాపాడుకోవాలన్నారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వ పాఠశాల లేకుండా పోతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని నాణ్యమైన విద్య అందుతుందని అవగాహన కల్పించారు. గ్రామంలోని ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు.

రాజన్న ఆలయంలో చతుర్వేద స్మార్త పరీక్షలు

వేములవాడ కల్చరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో నిర్వహిస్తున్న చతుర్వేద స్మార్త పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ నేతృత్వంలో రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేద విద్యార్థులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉదయం రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి పరీక్షాధికారులుగా వేదపండితులు వ్యవహరించారు. మొత్తంగా తొమ్మిది వేదాలకు దేశవ్యాప్తంగా 300 మంది వేద విద్యార్థులకు చతుర్వేద స్మార్త పరీక్షలు చేపట్టారు.

అనుమతి ఉన్నచోట్లకే ఇసుక తరలించాలి..

వీర్నపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అనుమతి తీసుకున్న చోట్లకే ట్రాక్టర్ యజమానులు ఇసుకను తరలించాలని ఎమ్మార్వో ముక్తార్ పాషా అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి మూలవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేసి వేబిల్లులను పరిశీలించారు. వేబిల్లు నంబర్ ట్రాక్టర్ నంబర్లు సరైనవేనా అని చూశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంట ఆర్ఐ శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా గోరింటాకు వేడుకలు

ఇల్లంతకుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో గోరింటాకు వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో విద్యార్థులు తెచ్చిన గోరింటాకుతో విద్యార్థులకు చేతులకు పెట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, అనువోజు రాజు, లక్ష్మీలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గోరింటాకు సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్. జలందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎం .అనిత, బానోతు రాజు, సంపతి రమేష్, ప్రణవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం సందర్శించిన ఎంపీడీవో

తంగళ్లపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులోని కేంద్రీయ విద్యాలయాన్ని ఎంపీడీవో లక్ష్మీనారాయణ శుక్రవారం సందర్శించారు. విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటేందుకు క్షుణ్ణంగా పరిశీలించారు. నాలుగు వేల మొక్కలను నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఖాళీస్థలాల్లో విరివిగా మొక్కలు నాటాలని ఉచితంగా అందిస్తామని తెలిపారు.

గోపాల యూత్ అసోసియేషన్ కార్యవర్గం

సిరిసిల్ల రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని గోపాల యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెద్దూర్ శివారులోని ఇప్పలపల్లెలోని శ్రీకృష్ణ యాదవ సంఘ భవనంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా గొడుగు మధుయాదవ్, ఉపాధ్యక్షుడిగా సలేంద్రి మహేష్‌యాదవ్, కక్షశాధికారిగా సలేంద్రి కిరణ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గంగుల వేణుయాదవ్‌లను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చందుర్తి జూలై 4 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కె.ప్రభాకర్, డాక్టర్ అభినయ రాణి ఆద్వర్యంలో విద్యార్థుల ఎత్తు పొడువు హృదయ స్పందనలను పరిశీలించారు. అనారోగ్యంగా ఉన్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు కటుకూరి ముఖేష్, ఫార్మసిస్ట్ సంధ్యారాణి, ఏఎన్ఎం దివ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహనీయులకు నివాళి

వేములవాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యలకు వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శుక్రవారం నివాళులర్పించారు. హెచ్ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ పెన్షన్లు అందజేయాలి

కోనరావుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ పెన్షన్లు అందజేయాలని ఐద్వా జిల్లా నాయకురాలు జవ్వాజి విమల కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోనరావుపేట అమలు చేస్తున్నానని చెప్పిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని పెన్షన్లను అర్హులందరికీ అందజేయాలని కోరుతూ తహసీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. మహిళలకు ఇస్తానన్న రూ. 2500, బీడీ కార్మికులకు పెన్షన్లు ప్రభుత్వం ఇస్తానన్న ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తను పరామర్శించిన బండి సంజయ్

కోనరావుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త కుమ్మరి దిలీప్‌ను శుక్రవారం కేంద్ర హోమ్ శాఖ సహాయమంత్రి బండి సంజయ్ పరామర్శించారు. కుమ్మరి దిలీప్‌కు రెండు కాళ్ల ప్రమాదంలో విరగగా ఆయనను పరామర్శించి మంత్రి బండి సంజయ్ మేము ఉన్నామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గోపాడి సురేందర్‌రావు, మిర్యాల్‌కార్ బాలాజీ తదితరులు ఉన్నారు.

బూత్ స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమం

గంభీరావుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం బూత్‌స్థాయి అధికారుల జాతీయ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులకు, సూపర్‌వైజర్లకు విధులు, ఓటరు జాబితా రూపకల్పనపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మారుతి, ట్రైనర్ మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భూమి ఇప్పించండి..

సిరిసిల్ల టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : తన భూమి తనకు ఇప్పించాంటూ బాధితురాలు చల్లా అనుసూర్య కోరారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో అనుసూర్యతో పాటు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడారు. సిరిసిల్ల పట్టణం బోనాల శివారులోని సర్వే నెంబరు 155లో విస్తీర్ణం రెండు ఎకరాల వ్యవసాయ భూమి తన పేరు మీద ఉందని, గతంలో వీఆర్వో విస్తీర్ణం ఎకరం పది గుంటలుగా 30 గుంటలు సస్పెక్ట్ భూమిగా ధరణిలో నమోదు చేశాడని ఆరోపించారు. దీనిపై హై కోర్టును ఆశ్రయించగా 8వారాలలో విచారణ జరిపించాలని అధికారులను ఆదేశించిందన్నారు. విచారణ జరపాలని సిరిసిల్ల తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు రాగుల రాములు, బుస్స వేణు, కంసాల మల్లేశం పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చందుర్తి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మర్రిగడ్డ మల్యాల నర్సింగాపూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎండి ఇస్మైల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు అవగాహన

గంభీరావుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం స్థానిక పోలీస్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తు సైబర్ క్రైమ్‌పై పూర్తి స్థాయిలో స్థానిక ఎస్ఐ రమాకాంత్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి..

వీర్నపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ లక్ష్మణ్ సైబర్ నేరాలపై, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు స్వప్న, నవీన్, ఉపాధ్యాయులు బాబు, సతీష్, లక్ష్మణ్, పావని, అలేఖ్య, రామచంద్రం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగిది. ఈ సంఘటనలో మండలంలోని రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన నల్లనాగుల రాజు తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రాజు తన స్కూటీపై రాచర్లతిమ్మాపూర్ నుంచి రాచర్లగొల్లపల్లి వైపునకు వస్తున్న క్రమంలో అటుగా వెళుతున్న కారు ఢీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

కుక్కదాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కుక్క దాడి చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వ్యక్తి బాలరాజు తీవ్ర గాయాలపాలయ్యాడని స్థానికులు శుక్రవారం తెలిపారు. క్షతగాత్రుడిని సిరిసిల్లకు తరలించారని పేర్కొన్నారు. గ్రామంలోని బాలరాజు తన ఇంటి నుంచి కిష్టంపల్లికి నడుచుకుంటూ వెళుతున్న క్రమంలో కుక్క దాడి చేసి గాయపర్చిందని చెప్పారు. ఇటీవల గ్రామంలో కుక్కల బెడద అధికమైందని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



గోరంటాలలో చెక్ డ్యాం నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఎల్లారెడ్డిపేట, జూలై4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సమస్యలున్నాయా..? అని ప్రశ్నించారు.ఇబ్బందులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. దసరా నాటికి ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ఆయన వెంట డీఆర్‌డీవో శేషాద్రి, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో రాజు, పంచాయతీ కార్యదర్శి దేవరాజు, తదితరులు ఉన్నారు.

● వీర్నపల్లి : మారుమూల వీర్నపల్లి మండలకేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ నమూన గృహము చాలా బావుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. నమూన గృహన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేసి గదులను, టాయిలెట్స్‌ను పరిశీలించారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తిచేసేలా చూడాలని ఆదేశించారు. వెంట జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీధర్, తహసీల్దార్ ముక్తార్ పాషా, సిరిసిల్ల హౌసింగ్ ఏఈ హకీం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, ఇంచార్జ్ పంచాయితి కార్యదర్శి రణధీర్ తదితరులు ఉన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

గంభీరావుపేట : గంభీరావుపేట మండలం గోరంటాల లోతు వాగు వద్ద చెక్‌డ్యాం నిర్మాణానికి సర్వేచేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గోరంటాల లోతు వాగు చెక్ డ్యాం నిర్మాణ స్థలాన్ని శుక్రవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద లోతు వాగు వద్ద చెక్ డ్యాంను యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని సూచించారు. అంతకు ముందు గోరంటాలలో కొనసాగుతున్న ఇందికమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గోరంటాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుండటంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీవో శేషాద్రి, ఎంపీడీవో రాజేందర్, తహసీల్దార్ మారుతిరెడ్డి తదితరులు ఉన్నారు.

పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి

సిరిసిల్ల టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి బీఆర్ఎస్ జిల్లా, పట్టణ నాయకులు పూలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోబీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరి ప్రవీణ్, మాజీ కౌన్సిలర్లు గుండ్లపెల్లి పూర్ణచందర్, కల్లూరి రాజు, రిక్కుమల్ల సంపత్‌కుమార్, జిల్లా నాయకులు బొల్లి రామ్మోహన్, కుంబాల మల్లారెడ్డి, సుంకపాక మనోజ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే సీపీఐ జిల్లా కార్యాలయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. దొడ్డి కొమరయ్య చిత్రపటానికి సీపీఐ జిల్లా, పట్టణ నాయకులు పూలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, పట్టణ కార్యదర్శి పంతం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎలిగేటి రాజశేఖర్, రాజమల్లు, దేవయ్య, పోచయ్య పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శుక్రవారం దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోడం రమణ,జిల్లా కమిటీ సభ్యులు అన్నల్‌దాస్ గణేష్, సూరం పద్మ, శ్రీరాముల రమేష్‌చంద్ర, నక్క దేవదాస్, బెజుగం సురేష్, జిందం కమలాకర్, గడ్డం రాజశేఖర్, పోచమల్లు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని మండల కేంద్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, మండల యాదవ సంఘం ఆధ్వర్యంలోని నాయకులు శుక్రవారం వేర్వేరుగా నిర్వహించారు. స్థానిక పాత బస్టాండు ప్రాంతంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తాజా, మాజీ జడ్పీటీసీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు కొమురయ్య చిత్ర పటానికి పూలమాలలు వేశారు. పాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డెరెక్టర్ కృష్ణహరి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేశారు. యాదవ సంఘం మండల అధ్యక్షుడు దోమకొండ కృష్ణకాంత్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి బొంగు మల్లేశం. యాదవ సంఘం నాయకులు కోట లింగం, దేవేందర్, రాజు, మహేష్, మల్లయ్య, శ్రీకాంత్, రమేష్, బాలయ్య, మల్లయ్య ఉన్నారు.



దొడ్డి కొమురయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

● చందుర్తి : చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో దేశం కోసం రాష్ట్రం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుల జయంతి, వర్ధంతి సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. త్రివర్ణ పతాక రూపకర్త పింగలి వెకయ్య, తెలంగాణ సాయుద పోరాటకర్త దొడ్డి కొమురయ్య, స్వామి వివేకనందల వర్ధంతి, అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కటుకూరి ముఖేష్, ఉపాధ్యాయులు మేకల పద్మ కోరెపు శ్రీనివాస్ న్యాతరి నాగమణి చింతల హరిష్మా, యాస నవ్య పాల్గొన్నారు.

మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, నాయకులు చిలుక పెంటయ్య, ఏనుగు శ్రీనివాస్, దుమ్మ అంజయ్య, సిరికొండ మల్లయ్య, దీకొండ తిరుపతిరావు, ఏనుగుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు సురేందర్‌రావు, మాజీ చైర్మన్ యాది మల్లేశ్, యాదవ సంఘం మండల అధ్యక్షులు రాగం నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, తాళ్ల విజయ్‌రెడ్డి భాను, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ మెర్గు అంజాగౌడ్, అఖిల పక్షం నాయకులు యాదవ కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



సిరిసిల్ల నుంచి తరలివెళుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళన బహిరంగ సభకు శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం నుండి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా, పట్టణ కాంగ్రెస్ నాయకులు సమావేశం జరిగింది. అనంతరం వాహనాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్మీయ సమ్మేళన బహిరంగ సభకు వెళ్లారు. బహరంగ సభకు వెళ్లినవారిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, సిరిసిల్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంకటేశం, జగన్, నర్సయ్య, ఖాజా, మాజీ కౌన్సిలర్లు వెంగళ లక్ష్మీనర్సయ్య, వేముల రవి, కుడికాల రవికుమార్, రెడ్యానాయక్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, వైద్య శివప్రసాద్, బాను పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో తలపెట్టిన గ్రామ కమిటీ, క్రియాశీల కార్యకర్తల సమ్మేళనానికి హాజరవుతున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కార్యక్రమానికి ఎల్లారెడ్డిపేట మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం తరలి వెళ్లాయి. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బస్సులో బయలుదేరారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గిరిధర్‌రెడ్డి, గౌస్, దేవేందర్, రవీందర్, రాజేందర్, బుచ్చాగౌడ్, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

● వీర్నపల్లి : హైదరాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు వీర్నపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మండల అధ్యక్షులు భూత శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున తరలివెళ్లారు. ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, వైస్ చైర్మన్ లక్ష్మణ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు హరిలాల్ నాయక్, సీనియర్ నాయకులు కాంతయ్య, ప్రకాష్, రాకేష్‌గౌడ్, శివరామకృష్ణ, సంతోష్ నాయక్, బాబు, ఏఎంసీ డైరెక్టర్లు తరలివెళ్లారు.

● ఇల్లంతకుంట : సామాజిక న్యాయ సమరభేరి సభకు మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్‌పార్టీ నాయకులు తరలివెళ్లారు. హైద్రాబాద్‌లో శుక్రవారం జరిగిన సమావేశానికి అన్ని గ్రామాల కాంగ్రెస్ నాయకులు బెజ్జంకి క్రాసింగ్‌కు చేరుకున్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జెండా ఊపి వాహనర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పీసీసీ కోఆర్డీనేటర్ పాశం రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ప్యాక్స్ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు ఆనందరెడ్డి, మల్లేశం, సత్యం, చిట్టి ప్రదీప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రామస్వామి, మాధవరెడ్డి, బెజ్జంకి శ్రీనివాస్, ఖాత మల్లేశం, యాస తిరుపతి, గుండ వెంకటేశం, సురేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డిలతో పాటు వివిద గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : సామాజిక న్యాయ సమరభేరి సభకు మండల కాంగ్రెస్ నాయకులు బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, తాళ్లపల్లి ప్రభాకర్, చేపూరి గంగాధర్, పల్లె రవీందర్‌రెడ్డి, నందుగౌడ్, అప్పాల నాగభూషణం తదితరులు ఉన్నారు.

● గంభీరావుపేట : సామాజిక న్యాయ సమరభేరి సభకు మండలం నుంచి పెద్దఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, తాడెపు కొమురయ్య, రంజాని నరేశ్ గాంత రాజు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ మీడియా సలహా మండలి అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



ఇల్లంతకుంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ మీడియా సలహా మండలి అధ్యక్షుడిగా ఐరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి గత 16 సంవత్సరాలుగా పాత్రికేయుడిగా కొనసాగుతున్నాడు. శ్రీనివాస్‌రెడ్డి నియామకంపై ప్రెస్‌క్లబ్ సభ్యులతో పాటు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

ఉపాధి వేటలో..

(5వ పేజీ తరువాయి)

నుంచి రూ5500 వరకు వలసకూలీలకు చెల్లిస్తున్నారు. స్థానికంగా ఉండే కూలీలకు కూడా డిమాండ్ ఏర్ప డింది. గతంలో రూ 300నుంచి రూ400వరకు ఉండే కూలీ ప్రస్తుతం రూ 500 నుంచి రూ 600 వరకు చెల్లిస్తున్నారు. మగ కూలీలకు రూ 700 నుంచి రూ 800వరకు ఇస్తున్నారు. దీంతో పాటు సిరిసిల్ల జిల్లాకు సరిహద్దులో ఉన్న సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, కామారెడ్డి జిల్లాల నుంచి పొరుగు గ్రామాలకు వరి నాట్లకు వచ్చే కూలీలకు రవాణా చార్జీలు అదనంగా చెల్లిస్తున్నారు. రైతులు మాత్రం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలతో నాట్లలో వేగం పెరిగిందని చెప్పు కుంటున్నారు.

రెండు నెలలు ఉపాధి దొరుకుతుంది..



- కామిరి రూప, చంద్రాపూర్ మహారాష్ట్ర

మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా బ్రహ్మపురి తాలూకా జోర్డీ గ్రామం మాది. మా ఊరిలో ఉపాధి లేక 20రోజులకు ముందే వ్యవసాయ పనులకు వలస వచ్చాం. ఎకరానికి రూ4వేలు ఇస్తున్నారు. రెండు నెల లపాటు ఉపాధి దొరుకుతుంది. అన్ని ఖర్చులు పోను రూ 50 వేలు మిగులుతాయి.

రోజూ ఆరు ఎకరాల్లో నాట్లు వేస్తాం..



- మురళీధర్, ఉత్తర ప్రదేశ్

మేము 40మంది కలిసి వచ్చాం. ప్రతి రోజు ఆరు ఎకరాల్లో నాట్లు వేస్తాం. పొలాల వద్ద ఉన్న రేకుల షెడ్‌లోనే ఉంటున్నాం. రెండు నెలల్లో దాదాపు 60వేల రూపాయలు మిగులుతాయి.

ఏకలవ్య గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

కోనరావుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మరిమడ్ల ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో పరిసరాలు, వంటగదులు, ఆహార పదార్థాలను పరిశీలించారు.

దివంగత మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలు

ఎల్లారెడ్డిపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, కృష్ణమూర్తి, రాజేందర్, గౌస్, మహేందర్, గిరిధర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రవీందర్, బుచ్చాగౌడ్, రాములు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం

కోనరావుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబానికి అండగా ఉంటామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం హామీ ఇచ్చారు. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన కూన తిరుపతి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఇంటి పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకోవాలని కొలనూరులో బండి సంజయ్‌కి వినతి పత్రం అందజేయగా, కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

అక్రమ అరెస్టులు సరికాదు..

ముస్తాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : అక్రమ అరెస్టులు సరికాదని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్ డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని హైదరాబాద్‌లోని సెక్రెటేరియట్ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళుతుంటే రాత్రికి రాత్రే అక్రమ అరెస్టులు చేసి పోలీసు ఠాణాకు తరలించారన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

వేములవాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌కు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు మరాటి రాజయ్య, కార్యదర్శి పందుల మల్లేశం, చంద్రయ్య, పోచమల్లు తదితరులు ఉన్నారు.

● చందుర్తి : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాధాకు పంచాయతీ కార్మికులు శుక్రవారం సమ్మె నోటీసును అందజేశారు. తెలంగాణ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, పంచాయతీ కార్మికులు బాబు, వజ్రవ్వ, నేరెళ్ల లచవ్వ, సంజీవ్, నర్సయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : సార్వత్రిక సమ్మెలో భాగంగా ఈనెల 9న బీడి పరిశ్రమ బంద్ పాటించాలని మండలంలోని బీడీ పరిశ్రమ యజమాన్యాలకు తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం నోటీస్ అందజేసింది. రాష్ట్ర అధ్యక్షుడు సిద్ది రాములు, జిల్లా అధ్యక్షుడు ముద్రకోల ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాపు ఎల్లయ్య, నాయకులు ప్రభు, వేణు, రాము, నర్సయ్య, కార్తీక్, శ్రీకాంత్, సురేశ్, నారయణ, విజయ్, ప్రసాద్, రాజు, లత, శారదా,మంజుల, రేణుక, మమత, లక్ష్మి పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ఈనెల 9వతేదీన చేపట్టే సమ్మె నోటీసు ఇస్తున్నట్లు తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మద్రకోల అంజనేయులు పేర్కొన్నారు. లంగర్, ఠాకూర్, సౌదేకర్ కంపెనీ మేనేజర్లకు సమ్మె నోటీసు ఇచ్చారు. బీఎల్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగారపు ఎల్లయ్య, ముద్రకోల అంజనేయులు, శ్రీనివాస్, రంగయ్య, శ్రీనివాస్, కిషన్, భూమయ్య, శంకర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీత..

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



పూడికతీత అనంతరం కాలువ..

సిరిసిల్ల రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : గొలుసుకట్టు కాలువల్లో పూడిక మట్టిని శుక్రవారం నీటిపారుద శాఖ అధికారులు తొలగించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధి పెద్దూర్ శివారులోని భవన్‌కుంట చెరువు మత్తడి నుంచి మైసమ్మ చెరువులోకి వరద నీరు పోయేందుకు నిర్మించిన కాలువలు పూడిక మట్టితో నిండిపోయాయి. పూడిక తీయాలని రైతులు నీటి పారుదల శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన కరువైంది. దీంతో మే 25న 'కాలువలు ఇలా నీరు పారేదెలా' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించారు. కాలువలను పరిశీలించి పూడిక తీయాలని నీటిపారుదల శాఖ అధికారులను అదేశించారు. దీంతో అధికారులు రెండు రోజుల నుంచి కాలువల్లో పేరుకపోయిన మట్టిని ఎక్స్‌కావేటర్‌లతో తొలగించారు.

సెస్ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలి..

- ఏఐఎఫ్‌టీయూ(న్యూ) జిల్లా కార్యవర్గ సభ్యుడు దశరథం

సిరిసిల్ల టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : అవినీతి అక్రమాలను ఎదుర్కొంటున్న సెస్ చెర్మన్ చిక్కాల రామారావు సెస్ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) జిల్లా కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2007లో మొదటిసారిగా సెస్ చైర్మన్‌గా ఎన్నికైన చిక్కాల రామారావు అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. రామారావు రెండవసారి సెస్ చైర్మన్‌గా గెలిచి కూడా అవినీతి అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నాడన్నారు. సొంత ఇల్లు ఉండి కూడా అద్దెభవనంలో కిరాయి ఉన్నట్లుగా నెలకు అద్దెను పొందుతున్నాడని ఆరోపించారు. కోఆపరేటివ్ యాక్ట్ 116సి ప్రకారం సంస్థ లాభాల్లో ఉంటేనే చైర్మన్ కార్యవర్గ సభ్యులు జీతభత్యాలు, ఇతర అలవెన్సులు పొందాలని సెస్ సంస్థ నష్టాలలో ఉంటే ఎలాంటి ప్రయోజనాలు పొందకూడదని ఉందన్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కారు డ్రైవన్ జీతం, కారుకు డీజిల్ దాదాపు నెలకు 300 లీటర్లు ఇతర మెయింటనెన్స్ ఖర్చులతో మొత్తం దాదాపు రూ.150000వేలు సంస్థ నుంచి అక్రమంగా ఆర్థిక లాభాం పొందుతున్నాడని ఆరోపించారు. సెస్‌ఎండీగా రిటైర్డ్ ఉద్యోగి మోహన్‌రెడ్డిని నియమించి చైర్మన్ అబాస్‌పాలైనాడని అన్నాడు. లైజన్ ఆఫీసర్‌గా రాంరెడ్డిని నియమించి ఆయనకు నెలకు రూ.40వేలు ఇచ్చి చైర్మన్ సొంత పనులకు వాడుకున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే జిల్లా సహకార అధికారిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సెస్‌లో అవినీతి అక్రమాలపై విచారణ పూర్తి చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గుజ్జ దేవదాస్, బొల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.